TG TEL/25/A1234
www.kakatiyanews.com

# ఉత్తరం కాకతీయ

శనివారం, 19 సెప్టెంబర్ 2026 | సంపుటి: 02 సంచిక: 33 | పేజీలు: 4 వెల: 5

## 22ఏ భూముల సమస్యలకు
# హైలెవల్ కమిటీ

**ముగ్గురు ఉన్నతాధికారులతో కమిటీ ఏర్పాటు**

- ఎల్బీనగర్‌లో 9,792 ప్లాట్ల రెగ్యులరైజేషన్‌కు గ్రీన్‌సిగ్నల్
- రేపటి నుంచి భూ యజమానులకు పట్టాల పంపిణీ
- రెవెన్యూ, గృహ నిర్మాణ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి



**కాకతీయ,తెలంగాణ బ్యూరో :** 22ఏ నిషేధిత భూములతో పాటు ఇతర భూసంబంధిత సమస్యల పరిష్కారానికి ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. ముగ్గురు ఉన్నతాధికారులతో హైలెవల్ కమిటీని ఏర్పాటు చేసింది. సీసీఎల్ఏ కమిషనర్ లోకేశ్‌కుమార్‌ను కమిటీ చైర్మన్‌గా నియమించింది. న్యాయశాఖ కార్యదర్శి పాపిరెడ్డి, స్టాంప్స్, రిజిస్ట్రేషన్ ఇన్‌స్పెక్టర్ జనరల్ రాజీవ్‌గాంధీ హనుమంతులను సభ్యులుగా నియమించింది. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ప్రకటించిన 12 అంశాల కార్యాచరణ ప్రణాళికకు అనుగుణంగా భూ సమస్యలను పరిష్కరించే దిశగా ప్రభుత్వం

........(తరువాయి 2లో)

## ఎల్‌నినోపై ముందస్తు చర్యలు

- రైతులు, తాగునీరు, పశుసంపద, విద్యుత్ రంగాలపై ప్రత్యేక దృష్టి
- 17 జిల్లాల్లో 20 నుంచి 46 శాతం వరకు వర్షపాతం లోటు
- 33 లక్షల పంప్‌సెట్లకు నిరంతర విద్యుత్ సరఫరా
- రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి

2

## దానం నాగేందర్‌కు
# షాక్!

**పార్టీ ఫిరాయింపుపై ఎమ్మెల్యే అనర్హత వేటు**



పోరాటం చేసుకుంటూ ఇక్కడి వరకు వచ్చానని, పోరాటం తనకు కొత్త కాదని ఖైరతాబాద్ ఎమ్మెల్యే దానం నాగేందర్ అన్నారు. బీఆర్ ఎస్ పార్టీ నుంచి ఎమ్మెల్యేగా గెలిచి.. ఆ పదవికి రాజీనామా చేయకుండానే కాంగ్రెస్ పార్టీ నుంచి ఎంపీగా పోటీ చేయడంపై హైకోర్టులో ఎమ్మెల్యే పాడి కౌశిక్‌రెడ్డి పిటిషన్ దాఖలు చేసిన విషయం తెలిసిందే. ఈ మేరకు శుక్రవారం హైకోర్టు ఈ విషయంపై తుది తీర్పును వెల్లడించింది. పార్టీ ఫిరాయింపునకు పాల్పడినట్లుగా స్పష్టమైన ఆధారాలున్నాయని పేర్కొంటూ దానం నాగేందర్‌పై ఎమ్మెల్యే అనర్హత వేటు వేసింది. అసెంబ్లీ స్పీకర్ గడ్డం ప్రసాద్ పంపిన నివేదికను హైకోర్టు తప్పుబట్టినట్లయింది.



- బీఆర్ఎస్ టికెట్‌పై గెలిచి కాంగ్రెస్‌లో చేరిన వ్యవహారంపై కోర్టు ఆగ్రహం
- ఖైరతాబాద్ ఎమ్మెల్యే పదవి రద్దుతో ఉప ఎన్నికకు అవకాశం
- పోరాటం నాకు కొత్త కాదు.. మళ్లీ గెలుస్తా
- ఉప ఎన్నికల్లో ఖచ్చితంగా విజయం సాధిస్తా
- సుప్రీంకోర్టును ఆశ్రయించే అంశంపై ఇంకా నిర్ణయం లేదు
- ఖైరతాబాద్ ఎమ్మెల్యే దానం నాగేందర్ వ్యాఖ్యలు

**కాకతీయ,తెలంగాణ బ్యూరో :** బీఆర్ఎస్ అభ్యర్థిగా ఖైరతాబాద్ నియోజకవర్గం నుంచి దానం నాగేందర్ ఎమ్మెల్యేగా విజయం సాధించారు. ఎన్నికల అనంతరం కాంగ్రెస్ పార్టీలో చేరారు. పార్టీ మార్పుపై బీఆర్ఎస్ నేతలు శాసనసభ స్పీకర్‌కు ఫిర్యాదు చేశారు. దానం నాగేందర్‌తో పాటు పార్టీ మారిన పలువురు ఎమ్మెల్యేలపై అనర్హత వేటు వేయాలని కోరారు. స్పీకర్ నిర్ణయంలో జాప్యం జరుగుతోందంటూ హైకోర్టును ఆశ్రయించారు. పార్టీ మారిన ఎమ్మెల్యేల వ్యవహారంపై విచారణ చేపట్టిన హైకోర్టు,

........(తరువాయి 2లో)

## ఆర్టీసీలో ఎన్నికలకు షెడ్యూల్

**గుర్తింపు సంఘం ఎన్నికల ఎనిమిదేళ్ల నిరీక్షణకు తెర**

- సెప్టెంబరు 21 నుంచే ఎన్నికల ప్రక్రియ
- అక్టోబరు 9న పోలింగ్.. 17న ఫలితాలు
- 48 వేల మంది కార్మికులకు ఓటు హక్కు
- వేతన సవరణ, ఉద్యోగ భద్రతే ప్రధాన ఎజెండా



2



# సత్యమేవ జయతే..

- మిగతా ఫిరాయింపు ఎమ్మెల్యేలకూ ఇదే తీర్పు
- మిగతా ఫిరాయింపు ఎమ్మెల్యేలపైనా న్యాయపోరాటం
- దానం నాగేందర్ అనర్హతపై హైకోర్టు తీర్పుపై కేటీఆర్ స్పందన
- ఖైరతాబాద్ ఉప ఎన్నికపై బీఆర్ఎస్ ప్రత్యేక దృష్టి
- ప్రజా తీర్పు కోరాల్సిందేనన్న హరీశ్‌రావు




**కాకతీయ,తెలంగాణ బ్యూరో :** సత్యమేవ జయతే.. పార్టీ మారిన మిగతా ఎమ్మెల్యేల విషయంలోనూ ఇదే తీర్పు వస్తుందని, ఫిరాయింపులపై బీఆర్ఎస్ న్యాయపోరాటం కొనసాగుతుందని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ అన్నారు. ఖైరతాబాద్ ఎమ్మెల్యే దానం నాగేందర్ అనర్హతపై హైకోర్టు ఇచ్చిన తీర్పును స్వాగతించిన కేటీఆర్, ఖైరతాబాద్ ఉప ఎన్నికలో బీఆర్ఎస్ విజయం సాధిస్తుందని ధీమా వ్యక్తం చేశారు. ఈ మేరకు సామాజిక మాధ్యమం ద్వారా స్పందించారు. 2023 అసెంబ్లీ ఎన్నికల్లో ఖైరతాబాద్ నియోజకవర్గం నుంచి బీఆర్ఎస్ అభ్యర్థిగా

........(తరువాయి 2లో)

- ప్రధానమంత్రి ఆవాస్ యోజన గ్రామీణ్ కింద కేటాయింపులు
- 2026–27 ఆర్థిక సంవత్సరానికి కేంద్రం ఆమోదం
- గత ప్రభుత్వ నిర్ణయంతో పథకానికి దూరమైన తెలంగాణ
- ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డికి లేఖతో సమస్య పరిష్కారానికి చర్యలు
- కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి వెల్లడి



## తెలంగాణకు రెండు లక్షల
# ఇళ్లు మంజూరు

**గ్రామీణ పేదల సొంతింటి కల సాకారం**



**కాకతీయ,తెలంగాణ బ్యూరో :** తెలంగాణ గ్రామీణ ప్రాంత ప్రజలకు సొంతింటి కలను సాకారం చేసే దిశగా కేంద్ర ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుందని కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి తెలిపారు. ప్రధానమంత్రి ఆవాస్ యోజన గ్రామీణ్ పథకం కింద రాష్ట్రానికి రెండు లక్షల ఇళ్లను మంజూరు చేసినట్లు వెల్లడించారు. 2026-27 ఆర్థిక సంవత్సరానికి ఈ ఇళ్ల కేటాయింపును ఆమోదించినట్లు పేర్కొన్నారు. గ్రామీణ ప్రాంతాల్లోని పేద కుటుంబాలకు ఈ నిర్ణయం ఎంతో ప్రయోజనకరంగా ఉంటుందని తెలిపారు. ప్రధాని నరేంద్ర మోదీ నాయకత్వంలోని కేంద్ర ప్రభుత్వం తెలంగాణకు రెండు లక్షల ఇళ్ల లక్ష్యాన్ని ఆమోదించిందని కేంద్ర మంత్రి తెలిపారు. గ్రామీణ ప్రాంతాల్లో సొంత ఇల్లు లేని అర్హులైన పేద కుటుంబాలకు ఇళ్ల నిర్మాణానికి ఈ కేటాయింపులు దోహదపడతాయని పేర్కొన్నారు. దేశవ్యాప్తంగా ప్రతి కుటుంబానికి సొంతింటి సౌకర్యం

........(తరువాయి 2లో)

## స్పామ్ కాల్స్‌కు చెక్..
# ట్రాయ్ కొత్త నిబంధనలు

- ఏఐ ఆధారిత నిఘా వ్యవస్థలు తప్పనిసరి
- 5 నంబర్లు స్పామ్‌గా తేలితే కఠిన చర్యలు
- రోబోకాల్స్‌పై నిమిషానికి 5 పైసల వరకు ఛార్జీ
- అధికారిక నంబర్లను బ్లాక్ చేస్తే యాప్‌లపై చర్యలు




**కాకతీయ,తెలంగాణ బ్యూరో :** పదేపదే మోగే అవాంఛిత ఫోన్‌కాల్స్, మెసేజ్‌లతో విసిగిపోతున్న వినియోగదారులకు టెలికాం నియంత్రణ సంస్థ ట్రాయ్ కీలక నిర్ణయాలు ప్రకటించింది. సైబర్ స్పామర్ల ఆగడాలకు అడ్డుకట్ట వేసేందుకు టెలికాం ఆపరేటర్లు ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ ఆధారిత గుర్తింపు వ్యవస్థలను తప్పనిసరిగా ఏర్పాటు చేసుకోవాలని స్పష్టం చేసింది. జియో, ఎయిర్‌టెల్, వి వంటి

........(తరువాయి 2లో)

## భూ కబ్జాలు నిరూపిస్తే
# రాజీనామా చేస్తాం



- ఆధారాలు చూపితే బీఆర్ఎస్ నేతలంతా రాజకీయాల నుంచి తప్పుకుంటాం
- వైఫల్యాలను ప్రశ్నిస్తే అక్రమ కేసులా
- బీఆర్ఎస్ సీనియర్ నేత, మాజీ మంత్రి తన్నీరు హరీశ్‌రావు ధ్వజం

3

## మహిళల అక్రమ రవాణా కేసులో
# 9 మందికి జీవిత ఖైదు




- ఉపాధి పేరుతో మహిళలను భారత్‌కు అక్రమంగా తరలింపు
- హైదరాబాద్‌లో వ్యభిచార కూపం నుంచి నలుగురికి విముక్తి
- దేశ భద్రత కోణంలో కేసును స్వీకరించిన ఎన్ఐఏ
- బంగ్లాదేశీయుల అక్రమ రవాణా కేసులో 9 మంది దోషులు

3

# దానం నాగేందర్‌కు షాక్..!

(మొదటిపేజీ తరువాయి)





రాజ్యాంగంలోని పదో షెడ్యూల్ నిబంధనలను పరిశీలించింది. ఒక పార్టీ తరఫున ఎన్నికై, అనంతరం మరో పార్టీలో చేరిన దానం నాగేందర్ విషయంలో అనర్హత వర్తిస్తుందని స్పష్టం చేసింది. దీంతో ఆయన శాసనసభ సభ్యత్వం రద్దయింది. ఖాళీ అయిన స్థానానికి ఉప ఎన్నిక నిర్వహించేందుకు ఎన్నికల సంఘం షెడ్యూల్ ప్రకటించనుంది.

**నాకు పోరాటం కొత్తేమీ కాదు..! : దానం నాగేందర్**

హైకోర్టు తీర్పుపై సుప్రీంకోర్టును ఆశ్రయించే అవకాశం ఉందా, ఈ విషయంలో ఏ నిర్ణయం తీసుకున్నారని మీడియా ప్రతినిధులు దానంనాగేందర్‌ను ప్రశ్నించగా, ఇంకా ఆలోచన చేయలేదని తెలిపారు. న్యాయపరమైన అంశాలపై చర్చించిన అనంతరం నిర్ణయం తీసుకుంటామని చెప్పారు. అయితే ఖచ్చితంగా పోరాడాలనే నిర్ణయం తీసుకున్నానని స్పష్టం చేశారు. ఎట్టి పరిస్థితుల్లోనూ వెనక్కి తగ్గేది లేదని, పోరాటం కొనసాగిస్తానని పేర్కొన్నారు. హైకోర్టు తీర్పు నేపథ్యంలో న్యాయపరమైన మార్గాలను పరిశీలిస్తున్నామని ఆయన తెలిపారు. ప్రజల మధ్య తనకు ఉన్న సంబంధం, నియోజకవర్గ ప్రజల మద్దతు తనకు బలమని చెప్పారు. ఎన్నో సవాళ్లను ఎదుర్కొంటూ రాజకీయంగా ఎదిగానని తెలిపారు. ప్రస్తుత పరిణామం కూడా తన రాజకీయ ప్రయాణంలో మరో పోరాటమేనని పేర్కొన్నారు. ఉప ఎన్నికల్లో ప్రజల తీర్పును కోరుతానని, ప్రజలు తనకు అండగా నిలుస్తారనే నమ్మకం ఉందని చెప్పారు. కచ్చితంగా గెలిచి తన సత్తా చాటుతానని ధీమా వ్యక్తం చేశారు. ఉప ఎన్నిక వచ్చినా ప్రజల్లోకి వెళ్లి తన వాదనను వివరించడంతో పాటు మళ్లీ విజయం సాధించేందుకు కృషి చేస్తానని తెలిపారు.

**నాలుగైదు నెలల్లో ఉప ఎన్నికకు అవకాశం**

దానం నాగేందర్ ఎమ్మెల్యే పదవి రద్దుతో ఖైరతాబాద్‌లో ఉప ఎన్నికకు మార్గం సుగమమైంది. సాధారణంగా ఖాళీ అయిన శాసనసభ స్థానానికి నిర్ణీత వ్యవధిలో ఎన్నిక నిర్వహించాల్సి ఉంటుంది. ఈ నేపథ్యంలో నాలుగైదు నెలల్లో ఉప ఎన్నిక జరిగే అవకాశం ఉందని రాజకీయ వర్గాల్లో చర్చ జరుగుతోంది. అయితే అధికారికంగా ఎన్నికల సంఘం షెడ్యూల్ ప్రకటించిన తర్వాతే ఎన్నికల ప్రక్రియపై స్పష్టత రానుంది. ఉప ఎన్నిక జరిగితే ఖైరతాబాద్ నియోజకవర్గం మరోసారి రాష్ట్ర రాజకీయాల్లో కీలకంగా మారనుంది. అధికార కాంగ్రెస్, ప్రతిపక్ష బీఆర్ఎస్ మధ్య పోటీ ఉత్కంఠభరితంగా సాగే అవకాశం ఉంది. దానం నాగేందర్ స్థానంలో ఏ పార్టీ నుంచి ఎవరు బరిలో నిలుస్తారనే అంశంపై ఇప్పటికే రాజకీయ చర్చ మొదలైంది. బీఆర్ఎస్ తరఫున అభ్యర్థి ఎంపిక, కాంగ్రెస్ వ్యూహం, దానం నాగేందర్ తదుపరి రాజకీయ అడుగులు ప్రాధాన్యం సంతరించుకున్నాయి.

**రాజకీయంగా తీవ్ర చర్చ**

దానం నాగేందర్ పార్టీ మారిన వ్యవహారం ఇప్పటికే తెలంగాణ రాజకీయాల్లో తీవ్ర చర్చకు దారితీసింది. బీఆర్ఎస్ నేతలు పార్టీ మారిన ఎమ్మెల్యేలపై అనర్హత వేటు వేయాలని డిమాండ్ చేస్తూ వచ్చారు. కాంగ్రెస్ నేతలు మాత్రం పార్టీ మార్పు అంశాన్ని సమర్థిస్తూ తమ రాజకీయ కార్యక్రమాలను కొనసాగించారు. ఈ వ్యవహారంలో హైకోర్టు తీర్పు వెలువడటంతో పార్టీ మార్పుల అంశం మరోసారి ప్రధాన చర్చగా మారింది. పార్టీ మారిన ఎమ్మెల్యేల విషయంలో స్పీకర్ నిర్ణయాలు, న్యాయస్థానాల జోక్యం, రాజ్యాంగంలోని పదో షెడ్యూల్ అమలు వంటి అంశాలు ప్రాధాన్యం పొందాయి. దానం నాగేందర్ సభ్యత్వం రద్దు కావడం ఇతర పార్టీ మారిన ఎమ్మెల్యేల వ్యవహారంపైనా ప్రభావం చూపే అవకాశం ఉందని రాజకీయ వర్గాలు భావిస్తున్నాయి. అయితే ప్రతి కేసులోని వాస్తవాలు, న్యాయపరమైన అంశాల ఆధారంగానే నిర్ణయాలు ఉంటాయి.




# స్పామ్ కాల్స్‌కు చెక్.. ట్రాయ్ కొత్త నిబంధనలు

(మొదటిపేజీ తరువాయి)

సర్వీస్ ప్రొవైడర్లు అనుమానిత స్పామ్ నంబర్ల వివరాలను పరస్పరం పంచుకోవాల్సి ఉంటుంది. 10 రోజుల వ్యవధిలో ఒకే సెండర్‌కు చెందిన 5 లేదా అంతకంటే ఎక్కువ నంబర్లు స్పామ్‌గా గుర్తిస్తే కఠిన చర్యలు తీసుకుంటారు. సంబంధిత నంబర్ల కేవైసీని పునఃపరిశీలించడం, అవుట్‌గోయింగ్ సేవలను నిలిపివేయడం లేదా కనెక్షన్‌ను శాశ్వతంగా రద్దు చేయడం వంటి చర్యలు ఉంటాయి. దీంతో ఒకే వ్యక్తి లేదా సంస్థ వేర్వేరు నంబర్లతో స్పామ్ కాల్స్ చేయకుండా నియంత్రించనున్నారు.

**రోబోకాల్స్‌కు ముకుతాడు**

మానవ ప్రమేయం లేకుండా రోబోకాల్స్, ఆటోమేటెడ్ ప్లాట్‌ఫారమ్‌ల ద్వారా వచ్చే కాల్స్‌ను అప్లికేషన్‌టుపర్సన్ (ఏ2పీ) కాల్స్‌గా వర్గీకరించారు. సంస్థలు తాము నిర్వహించే ఏ2పీ కాల్స్ వివరాలను ముందుగానే టెలికాం ఆపరేటర్లకు వెల్లడించాలి. నిబంధనలు పాటించని కాల్స్‌ను అనధికారిక స్పామ్‌గా పరిగణించి నిమిషానికి 5 పైసల వరకు టెర్మినేషన్ ఛార్జీ వసూలు చేస్తారు. అధికారిక వాణిజ్య, సేవా సమాచారానికి కేటాయించిన 140xx, 1600xx, 1601xx సిరీస్ నంబర్లను ట్రూకాలర్ వంటి యాప్‌లు స్పామ్‌గా ఫ్లాగ్ చేయడం, ఫిల్టర్ చేయడం లేదా బ్లాక్ చేయడాన్ని ట్రాయ్ నిషేధించింది. ఇకపై ఈ నంబర్ల విషయంలో యాప్‌లు నిబంధనలను కచ్చితంగా పాటించాల్సి ఉంటుంది.

# తెలంగాణకు రెండు లక్షల ఇళ్లు మంజూరు

(మొదటిపేజీ తరువాయి)



కల్పించాలనే లక్ష్యంలో భాగంగానే తెలంగాణకు ఇళ్లను మంజూరు చేసినట్లు వివరించారు.

**గత ప్రభుత్వ నిర్ణయంతో పథకానికి దూరమైన తెలంగాణ**

తెలంగాణలో గత బీఆర్ఎస్ ప్రభుత్వం 2018లో నిర్వహించిన ప్రధానమంత్రి ఆవాస్ యోజన గ్రామీణ్ ఆవాస్ సర్వేలో పాల్గొనకపోవడం వల్ల రాష్ట్రానికి ఇళ్ల మంజూరులో సమస్యలు ఏర్పడ్డాయని కేంద్ర మంత్రి తెలిపారు. ఇతర రాష్ట్రాల మాదిరిగా తెలంగాణలో అర్హులైన లబ్ధిదారుల జాబితా అందుబాటులో లేకుండా పోయిందని పేర్కొన్నారు. దీంతో గ్రామీణ ప్రాంతాల్లోని పేదలకు కేంద్ర పథకం ద్వారా ఇళ్ల నిర్మాణం చేపట్టడంలో ఇబ్బందులు ఎదురయ్యాయని వివరించారు. 2024 ఆగస్టులో ఎన్డీయే ప్రభుత్వం వరుసగా మూడోసారి అధికారంలోకి వచ్చిన అనంతరం తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డికి తాను లేఖ రాసినట్లు కేంద్ర మంత్రి వెల్లడించారు. రాష్ట్రంలో పథకం అమలుకు ఎదురవుతున్న సమస్యలను పరిష్కరించాలని కోరినట్లు తెలిపారు. తన లేఖకు ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి స్పందించారని, గత ప్రభుత్వం ఆవాస్ సర్వేలో పాల్గొనకపోవడం వల్ల ఏర్పడిన పరిస్థితిని వివరించారని పేర్కొన్నారు. తెలంగాణకు ఇళ్ల మంజూరులో కేంద్రం సహకరించాలని ముఖ్యమంత్రి కోరినట్లు తెలిపారు.

**కేంద్రంతో వరుస చర్చలు**

ఆ తర్వాత కేంద్ర వ్యవసాయ, రైతు సంక్షేమం, గ్రామీణాభివృద్ధి శాఖ మంత్రి శివరాజ్‌సింగ్ చౌహాన్‌తో సమన్వయం చేసుకుని తెలంగాణ గ్రామీణ ప్రాంతాలకు ఇళ్ల కేటాయింపుపై చర్చలు జరిపినట్లు కేంద్ర మంత్రి తెలిపారు. అధికారిక ఉత్తర ప్రత్యుత్తరాలు, పలుమార్లు నిర్వహించిన సమావేశాల ద్వారా రాష్ట్రానికి ప్రత్యేకంగా ఇళ్ల మంజూరును సాధించగలిగామని వివరించారు. గ్రామీణ పేదల అవసరాలను కేంద్రం దృష్టికి తీసుకెళ్లి, తెలంగాణకు ప్రత్యేక కేటాయింపులు చేయాలని కోరినట్లు పేర్కొన్నారు. రెండు లక్షల ఇళ్ల మంజూరుతో తెలంగాణ గ్రామీణ ప్రాంతాల్లోని అర్హులైన కుటుంబాలకు ప్రయోజనం చేకూరనుంది. కేంద్రం ఆమోదించిన లక్ష్యానికి అనుగుణంగా రాష్ట్ర ప్రభుత్వం లబ్ధిదారుల గుర్తింపు, జాబితాల తయారీ, ఇళ్ల నిర్మాణానికి సంబంధించిన తదుపరి చర్యలు చేపట్టాల్సి ఉంటుంది. నిధుల విడుదల, నిర్మాణ ప్రగతి, అర్హతలపై రాష్ట్ర ప్రభుత్వం స్పష్టత ఇవ్వాల్సి ఉంటుంది. తెలంగాణ ప్రజలకు ఇళ్ల కేటాయింపులో సహకరించిన కేంద్ర మంత్రి శివరాజ్‌సింగ్ చౌహాన్‌కు కేంద్ర మంత్రి కృతజ్ఞతలు తెలిపారు. ప్రతి ఒక్కరికీ సొంతింటి సౌకర్యం కల్పించాలనే 'అందరికీ ఇళ్లు' లక్ష్యాన్ని సాకారం చేసే దిశగా ఈ నిర్ణయం కీలక అడుగు అని పేర్కొన్నారు. కేంద్రం, రాష్ట్ర ప్రభుత్వాల సమన్వయంతో ఇళ్ల నిర్మాణ ప్రక్రియ వేగవంతం కావాలని గ్రామీణ ప్రజలు ఆశిస్తున్నారు.

# ఆర్టీసీలో ఎన్నికలకు షెడ్యూల్

**కాకతీయ,తెలంగాణ బ్యూరో :** తెలంగాణ రాష్ట్ర రోడ్డు రవాణా సంస్థలో గుర్తింపు కార్మిక సంఘం ఎన్నికలకు రంగం సిద్ధమైంది. ఎనిమిదేళ్లుగా ఎన్నికల కోసం ఎదురుచూస్తున్న ఆర్టీసీ కార్మికులకు ఎట్టకేలకు షెడ్యూల్ విడుదలైంది. కార్మిక శాఖ జాయింట్ డైరెక్టర్, ఎన్నికల రిటర్నింగ్ అధికారి ఎన్నికల నోటిఫికేషన్ జారీ చేశారు. సెప్టెంబరు 21 నుంచే ఎన్నికల ప్రక్రియ ప్రారంభం కానుంది. అక్టోబరు 9న ఉదయం 5 గంటల నుంచి సాయంత్రం 6 గంటల వరకు పోలింగ్ నిర్వహించనున్నారు. అక్టోబరు 14, 15 తేదీల్లో పోస్టల్ బ్యాలెట్ ద్వారా ఓటింగ్ జరగనుంది. అక్టోబరు 17న ఫలితాలు వెల్లడించనున్నట్లు అధికారులు ప్రకటించారు. అక్టోబరు 26న అన్ని జిల్లాల్లో తుది ఓటరు జాబితాను విడుదల చేయనున్నట్లు నోటిఫికేషన్‌లో పేర్కొన్నారు. చివరిసారిగా 2016 జులై 19న ఆర్టీసీలో గుర్తింపు సంఘం ఎన్నికలు జరిగాయి.

**గుర్తింపు సంఘాలకే చర్చల హక్కు**

ఆర్టీసీలో పలు కార్మిక సంఘాలు ఉన్నప్పటికీ ఎన్నికల్లో విజయం సాధించిన సంఘాలనే గుర్తింపు సంఘాలుగా పరిగణిస్తారు. గుర్తింపు పొందిన సంఘాలు రీజియన్, రాష్ట్రస్థాయిల్లో పనిచేస్తాయి. రెండు స్థాయిల ఎన్నికలకు వేర్వేరు బ్యాలెట్ పత్రాలను వినియోగిస్తారు. కార్మికుల వేతనాలు, బోనస్‌లు, కరవు భత్యం, సర్వీస్ నిబంధనలు తదితర అంశాలపై యాజమాన్యం, ప్రభుత్వంతో చర్చలు జరిపే చట్టపరమైన హక్కు గుర్తింపు సంఘాలకే ఉంటుంది. కార్మికుల తరఫున ఒప్పందాలు కుదుర్చుకోవడంలోనూ ఇవి కీలక పాత్ర పోషిస్తాయి. రీజియన్‌లో పనిచేసే అధికారి స్థాయి ఉద్యోగులను మినహాయించి మిగిలిన ఆర్టీసీ ఉద్యోగులు, కార్మికులందరూ ఓటు వేయడానికి అర్హులు.

**48 వేల మందికి ఓటు హక్కు**

వాస్తవానికి గుర్తింపు సంఘం ఎన్నికలు 2018లోనే జరగాల్సి ఉన్నప్పటికీ అప్పటి ప్రభుత్వం నిర్వహించలేదు. ఈసారి దాదాపు 48 వేల మంది ఆర్టీసీ ఉద్యోగులు తమ ఓటు హక్కును వినియోగించుకోనున్నారు. ఎన్నికల షెడ్యూల్ విడుదల కావడంతో పలు కార్మిక సంఘాలు ఇప్పటికే ప్రచారాన్ని ముమ్మరం చేశాయి. కార్మికుల సమస్యలు, వేతన సవరణ, ఉద్యోగ భద్రత, సర్వీస్ నిబంధనలు, పెండింగ్ సమస్యల పరిష్కారం వంటి అంశాలు ప్రధాన ఎజెండాగా మారాయి. ఎన్నికలను పారదర్శకంగా నిర్వహించేందుకు కార్మిక శాఖ ఏర్పాట్లు చేస్తోంది.

**ఎన్నికల ప్రక్రియ ఇలా**

సెప్టెంబరు 18న ఎన్నికల షెడ్యూల్ విడుదలైంది. సెప్టెంబరు 21న ఎన్నికల్లో పోటీ చేయడానికి సంఘాల సమ్మతి తీసుకోనున్నారు. సెప్టెంబరు 22న యూనియన్లకు ఓటరు జాబితా అందజేయడంతోపాటు అభ్యంతరాల స్వీకరణ ప్రారంభమవుతుంది. సెప్టెంబరు 24న ఓటరు జాబితాపై అభ్యంతరాలు దాఖలు చేసేందుకు అవకాశం కల్పించారు. సెప్టెంబరు 25న సంఘాలకు తుది ఓటరు జాబితాను అందజేస్తారు. సెప్టెంబరు 26న యూనియన్లకు ఎన్నికల గుర్తులు కేటాయించి, తుది ఓటరు జాబితాను రిటర్నింగ్ అధికారికి అప్పగిస్తారు. సెప్టెంబరు 29న సంఘాలకు నమూనా బ్యాలెట్ పత్రాలను సమర్పిస్తారు. అక్టోబరు 9న సాధారణ పోలింగ్, అక్టోబరు 14, 15 తేదీల్లో పోస్టల్ బ్యాలెట్ ఓటింగ్ నిర్వహించి, అక్టోబరు 17న ఫలితాలు వెల్లడించనున్నారు.

## 22ఏ భూముల సమస్యలకు హైలెవల్ కమిటీ

(మొదటిపేజీ తరువాయి)



ముందుకెళ్తోందని రెవెన్యూ, గృహ నిర్మాణ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి తెలిపారు.

**ఎల్బీనగర్‌లో 9,792 ప్లాట్లకు గ్రీన్‌సిగ్నల్**

జీవో నంబర్ 118 కింద ఎల్బీనగర్‌లో రెగ్యులరైజేషన్ కోసం అందిన 9,792 దరఖాస్తులను నెల రోజుల్లోగా పరిష్కరించాలని ప్రభుత్వం ఆదేశించింది. ఈ నిర్ణయంతో ఆయా కాలనీల్లోని 9,700కు పైగా కుటుంబాలకు ప్రయోజనం చేకూరనుంది. శనివారం నుంచే క్రమబద్ధీకరణ ప్రక్రియ ప్రారంభమవుతుందని మంత్రి తెలిపారు. భూ యజమానులకు రేపటి నుంచే పట్టాల పంపిణీ చేస్తామని వెల్లడించారు. సింగరేణి కాలనీ పరిధిలోని భూ సమస్యలను పరిష్కరించేందుకు జిల్లా స్థాయి కమిటీలు ఏర్పాటు చేయనున్నట్లు పొంగులేటి తెలిపారు. ఉపముఖ్యమంత్రి భట్టి విక్రమార్క, పరిశ్రమల శాఖ మంత్రి శ్రీధర్‌బాబుతో చర్చలు జరిపామని, దీనికి సంబంధించిన జీవోను రేపే విడుదల చేస్తామని చెప్పారు.

**నిలిచిపోయిన రిజిస్ట్రేషన్లకు పరిష్కారం**

హెచ్ఎండీఏ, జీహెచ్ఎంసీ, డీటీసీపీ వంటి సంస్థల నుంచి అనుమతులు పొందినా సెక్షన్ 22ఏ కారణంగా రిజిస్ట్రేషన్లు నిలిచిపోయిన లేఅవుట్లను కూడా రెగ్యులరైజ్ చేసే ప్రక్రియ ప్రారంభిస్తామని మంత్రి తెలిపారు. ముఖ్యమంత్రి హామీ ఇచ్చినట్లుగా వీటిపై 1-2 రోజుల్లో నిర్ణయం తీసుకుంటామని శాసనసభ వేదికగా వెల్లడించారు.

## సత్యమేవ జయతే..

(మొదటిపేజీ తరువాయి)



దానం నాగేందర్ విజయం సాధించారు. అనంతరం కాంగ్రెస్‌లో చేరారు. 2024 లోక్‌సభ ఎన్నికల్లో సికింద్రాబాద్ నుంచి కాంగ్రెస్ అభ్యర్థిగా పోటీ చేశారు. అయితే అప్పటివరకు బీఆర్ఎస్ ఎమ్మెల్యేగా కొనసాగారు. పార్టీ మారిన నేపథ్యంలో దానం నాగేందర్‌ను అనర్హుడిగా ప్రకటించాలని బీఆర్ఎస్ ఎమ్మెల్యే పాడి కౌశిక్‌రెడ్డి, బీజేపీ శాసనసభాపక్ష నేత ఏలేటి మహేశ్వర్‌రెడ్డి స్పీకర్‌కు ఫిర్యాదు చేశారు. స్పీకర్ ఆ పిటిషన్‌ను తిరస్కరించగా, దానిపై హైకోర్టును ఆశ్రయించారు. విచారణ అనంతరం స్పీకర్ నిర్ణయాన్ని పక్కనపెట్టిన హైకోర్టు, దానం నాగేందర్ అనర్హత 2024 ఏప్రిల్ 23 నుంచే అమల్లోకి వస్తుందని స్పష్టం చేసింది. దీంతో ఖైరతాబాద్ నియోజకవర్గానికి ఉప ఎన్నిక అనివార్యమయ్యే పరిస్థితి ఏర్పడింది.

**ఫిరాయింపులపై బీఆర్ఎస్ న్యాయపోరాటం**

దానం నాగేందర్‌పై వచ్చిన తీర్పును మిగతా ఫిరాయింపు ఎమ్మెల్యేల వ్యవహారాల్లోనూ కీలక పరిణామంగా బీఆర్ఎస్ భావిస్తోంది. పార్టీ మారిన ఎమ్మెల్యేలపై దాఖలైన పిటిషన్లను చట్టప్రకారం విచారించి నిర్ణయం తీసుకోవాలని బీఆర్ఎస్ నేతలు డిమాండ్ చేస్తున్నారు. న్యాయస్థానాల తీర్పులతో ఫిరాయింపుల అంశాన్ని ప్రజల్లోకి తీసుకెళ్లాలని పార్టీ నాయకత్వం భావిస్తోంది. ఒక పార్టీ గుర్తుపై గెలిచి మరో పార్టీలో చేరిన ఎమ్మెల్యేలు తిరిగి ప్రజల తీర్పు కోరాల్సిందేనని బీఆర్ఎస్ నేతలు స్పష్టం చేస్తున్నారు. దానం నాగేందర్ విషయంలో వచ్చిన తీర్పు మిగతా కేసులపైనా ప్రభావం చూపుతుందని వారు చెబుతున్నారు. దానం నాగేందర్ అనర్హతపై హైకోర్టు తీర్పును మాజీ మంత్రి హరీశ్‌రావు స్వాగతించారు. పార్టీ ఫిరాయింపుల విషయంలో 2024 కాంగ్రెస్ మేనిఫెస్టోలో ఇచ్చిన హామీ ఏమైందని ప్రశ్నించారు. పార్టీ మారిన ఎమ్మెల్యేలపై పెండింగ్‌లో ఉన్న పిటిషన్లను కూడా చట్టప్రకారం పరిష్కరించాలని కోరారు. ప్రజల ఓట్లతో ఒక పార్టీ నుంచి గెలిచి, అధికారంలో ఉన్న మరో పార్టీలో చేరిన ఎమ్మెల్యేలు పదవులకు రాజీనామా చేసి తిరిగి ప్రజా తీర్పు పొందాలని హరీశ్‌రావు అన్నారు. ఫిరాయింపుల అంశాన్ని కాంగ్రెస్ ప్రభుత్వ వైఖరికి వ్యతిరేకంగా ప్రజల్లోకి తీసుకెళ్లేందుకు బీఆర్ఎస్ సిద్ధమవుతోంది.

**ఖైరతాబాద్ ఉప ఎన్నికపై ప్రత్యేక దృష్టి**

దానం నాగేందర్ అనర్హతతో ఖైరతాబాద్‌లో ఉప ఎన్నిక జరిగే అవకాశం ఏర్పడింది. ఈ ఎన్నికను బీఆర్ఎస్ రాజకీయంగా కీలకంగా చూస్తోంది. హైకోర్టు తీర్పును ప్రజాస్వామ్య విజయంగా ప్రచారం చేయడంతోపాటు, పార్టీ మారిన ఎమ్మెల్యేలకు ప్రజలు తగిన సమాధానం ఇస్తారని బీఆర్ఎస్ నేతలు చెబుతున్నారు. ఖైరతాబాద్ ఉప ఎన్నికలో బీఆర్ఎస్ విజయం సాధించడం ఖాయమని పాడి కౌశిక్‌రెడ్డి పేర్కొన్నారు. పార్టీ గుర్తుపై గెలిచి మరో పార్టీలో చేరిన ఎమ్మెల్యేలకు అనర్హత తప్పదని అన్నారు. ఈ తీర్పు ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డికి చెంపపెట్టు వంటిదని వ్యాఖ్యానించారు. మరో 8 మంది ఎమ్మెల్యేలపై కూడా అనర్హత వేటు పడే అవకాశం ఉందని కౌశిక్‌రెడ్డి తెలిపారు.

**తీర్పును రాజకీయ అస్త్రంగా మలిచే వ్యూహం**

దానం నాగేందర్ కేసులో తీర్పు నేపథ్యంలో బీఆర్ఎస్ తన రాజకీయ కార్యాచరణను మరింత వేగవంతం చేయాలని నిర్ణయించినట్లు పార్టీ వర్గాల్లో చర్చ జరుగుతోంది. ఫిరాయింపు ఎమ్మెల్యేల అంశాన్ని న్యాయపరంగానే కాకుండా రాజకీయంగానూ ముందుకు తీసుకెళ్లాలని నాయకత్వం భావిస్తోంది. కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన హామీలు, పార్టీ మారిన ఎమ్మెల్యేలపై తీసుకోవాల్సిన చర్యలు, ప్రజా తీర్పు వంటి అంశాలను ప్రధానంగా ప్రస్తావిస్తూ ప్రచారం నిర్వహించే అవకాశం ఉంది. ఖైరతాబాద్ ఉప ఎన్నిక జరిగితే దానిని ఫిరాయింపులపై ప్రజాభిప్రాయానికి ప్రతీకగా మలచాలని బీఆర్ఎస్ చూస్తోంది. కోర్టు తీర్పుపై ఏలేటి మహేశ్వర్‌రెడ్డి కూడా హర్షం వ్యక్తం చేశారు. మిగతా పిటిషన్లను చట్టప్రకారం పరిష్కరించాలని కోరారు.



# ఎల్‌నినోపై ముందస్తు చర్యలు

**కాకతీయ,తెలంగాణ బ్యూరో :** ఎల్‌నినో ప్రభావంతో రాష్ట్రంలో వర్షపాతం లోటు ఏర్పడే అవకాశం ఉందని ముందుగానే గుర్తించిన ప్రభుత్వం అన్ని రంగాలపై ముందస్తు ప్రణాళికతో పనిచేస్తోందని రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి తెలిపారు. శుక్రవారం శాసనసభలో ఎల్‌నినోపై జరిగిన స్వల్పకాలిక చర్చలో ఆయన మాట్లాడారు. రైతులు, తాగునీరు, పశుసంపద, విద్యుత్ రంగాలపై ప్రత్యేక దృష్టి సారిస్తున్నామని చెప్పారు. ఈ నెల 10వ తేదీ వరకు 17 జిల్లాల్లో సాధారణం కంటే 20 నుంచి 46 శాతం వరకు తక్కువ వర్షపాతం నమోదైందని మంత్రి వివరించారు. యాదాద్రి భువనగిరిలో 21 శాతం, హైదరాబాద్‌లో 22 శాతం, మెదక్‌లో 23 శాతం, వికారాబాద్‌లో 26 శాతం, మేడ్చల్-మల్కాజిగిరిలో 28 శాతం, జనగామలో 30 శాతం, ఆదిలాబాద్‌లో 31 శాతం, మహబూబ్‌నగర్‌లో 32 శాతం లోటు నమోదైందన్నారు. భద్రాద్రి కొత్తగూడెం, నల్గొండలో 33 శాతం, సూర్యాపేటలో 34 శాతం, వరంగల్, ఖమ్మంలో 37 శాతం, నారాయణపేటలో 38 శాతం, నాగర్‌కర్నూల్‌లో 39 శాతం, వనపర్తిలో 41 శాతం, హనుమకొండలో 42 శాతం, జోగులాంబ గద్వాలలో 46 శాతం తక్కువ వర్షపాతం నమోదైందని తెలిపారు. ఒక నెలలో పడాల్సిన వర్షం గంటలో కురిసి క్లౌడ్‌బరస్ట్ రూపంలో నమోదైతే రికార్డుల్లో వర్షపాతం కనిపించినా.. ఆ నీరు ప్రజలకు పూర్తిస్థాయిలో ఉపయోగపడదని వివరించారు.

**సీఎం స్థాయిలో ముందస్తు సమీక్షలు**

ఎల్‌నినో ప్రభావంపై ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఇప్పటికే ఉన్నతస్థాయి సమీక్షలు నిర్వహించారని మంత్రి తెలిపారు. తక్కువ వర్షపాతం పరిస్థితుల్లో రైతులు ఏ పంటలు సాగు చేయాలి, అందుబాటులోని నీటిని ఎలా వినియోగించుకోవాలనే అంశాలపై వ్యవసాయ శాస్త్రవేత్తలు, అధికారులతో మండలాలు, ప్రధాన గ్రామాల వారీగా సమీక్షలు చేపట్టామన్నారు. జూలై 17న జరిగిన కేబినెట్ సమావేశంలోనూ ఎల్‌నినో ప్రభావంపై చర్చించి కీలక నిర్ణయాలు తీసుకున్నామని చెప్పారు.

**33 లక్షల పంప్‌సెట్లకు విద్యుత్**

వర్షాభావ పరిస్థితుల్లో రైతులు బోర్లపై ఆధారపడుతున్నారని, రాష్ట్రంలో సుమారు 33 లక్షల పంప్‌సెట్లు పనిచేస్తున్నాయని పొంగులేటి తెలిపారు. సెప్టెంబర్ 9న విద్యుత్ డిమాండ్ 19,575 మెగావాట్లకు చేరిందన్నారు. రైతులకు విద్యుత్ సరఫరాలో ఇబ్బందులు లేకుండా ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క నేతృత్వంలో చర్యలు తీసుకుంటున్నామని చెప్పారు. పశువులకు మేత, నీటి కొరత రాకుండా దీర్ఘకాలిక ప్రణాళికలు సిద్ధం చేయాలని సీఎం ఆదేశించారని మంత్రి తెలిపారు. ఎల్‌నినో ప్రభావాన్ని ఎదుర్కొనేందుకు కేంద్ర ప్రభుత్వం అన్ని రంగాల్లో సహకరించాలని కోరారు. రాజకీయాలకు అతీతంగా ప్రజల ప్రయోజనాల కోసం కలిసి పనిచేయాల్సిన సమయం ఇదేనన్నారు.

# మహిళల అక్రమ రవాణా కేసులో 9 మందికి జీవిత ఖైదు

- ఉపాధి పేరుతో మహిళలను భారత్‌కు అక్రమంగా తరలింపు
- హైదరాబాద్‌లో వ్యభిచార కూపం నుంచి నలుగురికి విముక్తి
- దేశ భద్రత కోణంలో కేసును స్వీకరించిన ఎన్ఐఏ
- బంగ్లాదేశీయుల అక్రమ రవాణా కేసులో 9 మంది దోషులు

**కాకతీయ,తెలంగాణ బ్యూరో :** ఉపాధి కల్పిస్తామనే ఆశ చూపి బంగ్లాదేశ్ నుంచి మహిళలను భారత్‌కు అక్రమంగా తరలించి వ్యభిచారంలోకి దించిన కేసులో హైదరాబాద్ ఎన్ఐఏ కోర్టు 8 మంది బంగ్లాదేశీయులతోపాటు మరో వ్యక్తిని దోషులుగా తేల్చింది. నిందితులకు జీవిత ఖైదుతోపాటు రూ.1.37 లక్షల జరిమానా విధించింది. జరిమానా చెల్లించకపోతే మరో 3 నెలల సాధారణ జైలు శిక్ష అనుభవించాలని ఆదేశించింది. 2019 సెప్టెంబర్‌లో హైదరాబాద్ శివారులోని జల్‌పల్లిలో వ్యభిచారం నిర్వహిస్తున్న ప్రాంతం నుంచి పోలీసులు ముగ్గురు బంగ్లాదేశీ మహిళలను రక్షించారు. బాలాపూర్ మహిమూద్ కాలనీలోని ఓ ఇంటి నుంచి మరో మహిళను కాపాడి నిందితులపై కేసు నమోదు చేశారు. రెండు దేశాలకు సంబంధించిన వ్యవస్థీకృత నేరం కావడం, దేశ భద్రత అంశం ఉండటంతో కేసును లోతుగా దర్యాప్తు చేసేందుకు ఎన్ఐఏ రంగంలోకి దిగింది.

**12 మందిపై ఛార్జిషీట్**

2019 అక్టోబర్ 12న ఎన్ఐఏ కేసును స్వీకరించి మళ్లీ నమోదు చేసింది. మానవ అక్రమ రవాణా కేసులను కూడా ఎన్ఐఏ విచారించేలా 2019 జులైలో పార్లమెంట్ ఎన్ఐఏ చట్టాన్ని సవరించింది. దీంతో దేశంలో ఎన్ఐఏ నమోదు చేసిన తొలి మానవ అక్రమ రవాణా కేసుగా ఇది గుర్తింపు పొందింది. 2020 అక్టోబర్ 17న రుహుల్ అమిన్ ధాలి, మహ్మద్ యూసుఫ్ ఖాన్ అలియాస్ ఎండీ ఇమ్రాన్, బితి బేగం అలియాస్ ఖదిజా షేక్, ఇమాముల్ ఘాజీ అలియాస్ మహ్మద్ రాణా హుస్సేన్, మహ్మద్ అల్ మమున్, సోజిబ్ షేక్, సురేశ్ కుమార్ అలియాస్ సాగర్, మహ్మద్ అబ్దుల్లా మున్షీ అలియాస్ అబ్దుల్ సర్కార్, మహ్మద్ ఆయుబ్ షేక్‌లతోపాటు మరో ముగ్గురిపై ఎన్ఐఏ ఛార్జిషీట్ దాఖలు చేసింది. ఏ1, ఏ3, ఏ7 నిందితులు పరారీలో ఉండగా.. మిగిలిన వారిని తెలంగాణ, పశ్చిమ బెంగాల్‌లో గుర్తించి అరెస్ట్ చేశారు.

# భూ కబ్జాలు నిరూపిస్తే రాజీనామా చేస్తాం

- ఆధారాలు చూపితే బీఆర్ఎస్ నేతలంతా రాజకీయాల నుంచి తప్పుకుంటాం
- వైఫల్యాలను ప్రశ్నిస్తే అక్రమ కేసులా
- బీఆర్ఎస్ సీనియర్ నేత, మాజీ మంత్రి తన్నీరు హరీశ్‌రావు ధ్వజం

**కాకతీయ,తెలంగాణ బ్యూరో :** కాంగ్రెస్ ప్రభుత్వం తన వైఫల్యాలను కప్పిపుచ్చుకునేందుకే మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్‌ను లక్ష్యంగా చేసుకుని భూకబ్జా ఆరోపణలు చేస్తోందని బీఆర్ఎస్ సీనియర్ నేత, మాజీ మంత్రి తన్నీరు హరీశ్‌రావు మండిపడ్డారు. గురివింద గింజ తన నలుపెరుగనట్లు కాంగ్రెస్ సర్కారు పాలన సాగిస్తోందని విమర్శించారు. ప్రజా సమస్యలను గాలికొదిలేసి ప్రతిపక్షంపై బురదజల్లడం మానుకోవాలని హితవు పలికారు. కేసీఆర్ ఏనాడూ భూకబ్జాలకు పాల్పడలేదని హరీశ్‌రావు స్పష్టం చేశారు. ఆధారాలతో భూకబ్జా నిరూపిస్తే బీఆర్ఎస్ నేతలంతా మూకుమ్మడిగా రాజీనామాలు చేసి రాజకీయాల నుంచి వైదొలుగుతామని ప్రకటించారు. ఆరోపణలను నిరూపించడంలో విఫలమైతే ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, మంత్రులు పదవుల నుంచి తప్పుకోవడానికి సిద్ధంగా ఉన్నారా అని ప్రశ్నించారు.

**ప్రజా సమస్యలపై దృష్టి పెట్టాలి**

ఎన్నికల హామీలను అమలు చేయడంలో విఫలమైన ప్రభుత్వాన్ని ప్రజాక్షేత్రంలో నిలదీస్తుంటే సమాధానం చెప్పలేక దాడులకు, అక్రమ కేసులకు పాల్పడుతున్నారని హరీశ్‌రావు ఆరోపించారు. పాలనా లోపాలను ఎండగడుతున్నామనే అక్కసుతో ప్రతిపక్షంపై కుట్రలు పన్నుతున్నారని దుయ్యబట్టారు. రాజకీయ కక్షసాధింపు చర్యలను వెంటనే నిలిపివేసి రైతులు, ప్రజల సమస్యల పరిష్కారంపై దృష్టి సారించాలని ప్రభుత్వాన్ని హెచ్చరించారు. పాలనలో ప్రజలకు ఇచ్చిన హామీల అమలు, రైతుల ఇబ్బందులు, సంక్షేమ పథకాలపై ప్రభుత్వం సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు.

# ఏసీబీ వలలో తహసీల్దార్ సృజన్‌కుమార్

- వారసత్వ భూమి మార్పిడికి రూ. 15 వేలు డిమాండ్
- బేరసారాల అనంతరం రూ. 14 వేలకు ఒప్పందం
- లంచం తీసుకుంటుండగా గోవిందరావుపేట అధికారి పట్టివేత

**కాకతీయ, ములుగు ప్రతినిధి :** పూర్వీకుల వ్యవసాయ భూమి వారసత్వ హక్కు నమోదు విషయంలో అనుకూలంగా వ్యవహరించేందుకు రూ. 14 వేల లంచం తీసుకుంటూ గోవిందరావుపేట తహసీల్దార్ నెల్లుట్ల సృజన్‌కుమార్ ఏసీబీ అధికారులకు పట్టుబడ్డారు. ఏసీబీ వరంగల్ రేంజ్ అధికారులు శుక్రవారం తహసీల్దార్ కార్యాలయంలో ట్రాప్ నిర్వహించి నిందితుడిని రెడ్‌హ్యాండెడ్‌గా పట్టుకున్నారు. ఏసీబీ ప్రెస్‌నోట్ ప్రకారం.. ఫిర్యాదుదారుడి భార్య లింగాల శ్రీలత పేరుతో ఉన్న పూర్వీకుల వ్యవసాయ భూమికి వారసత్వ హక్కు నమోదు విషయంలో అనుకూలంగా వ్యవహరించేందుకు తహసీల్దార్ తొలుత రూ. 15 వేల లంచం డిమాండ్ చేశారు. అనంతరం బేరసారాల ద్వారా రూ. 14 వేలకు తగ్గించారు. ఈ మొత్తాన్ని స్వీకరించి కుడివైపు ట్రౌజర్ జేబులో పెట్టుకున్న సమయంలో ఏసీబీ అధికారులు పట్టుకున్నారు. తహసీల్దార్ కుడిచేతి వేళ్లకు నిర్వహించిన రసాయన పరీక్షలో పాజిటివ్ ఫలితం వచ్చినట్లు ఏసీబీ తెలిపింది. లంచం స్వీకరించినట్లు ప్రాథమికంగా నిర్ధారణ కావడంతో సృజన్‌కుమార్‌ను అరెస్ట్ చేసి వరంగల్‌లోని ఎస్పీఈ, ఏసీబీ కేసుల ప్రత్యేక న్యాయస్థానం ముందు హాజరుపరచనున్నట్లు వెల్లడించింది. కేసు దర్యాప్తులో ఉందని తెలిపింది.

# భూముల రి సర్వేకు గ్రామస్తులు సహకరించాలి

**పరకాల ఆర్డీవో డీఎస్ వెంకన్న**

**కాకతీయ,ఆత్మకూరు :** భూముల రి సర్వేకు గ్రామస్తులు సహకరించాలని పరకాల పరకాల ఆర్డిఓ డిఎస్ వెంకన్న అన్నారు.శుక్రవారం ఆత్మకూరు మండలం అగ్రంపహాడ్ గ్రామంలో నిర్వహిస్తున్న రి సర్వే కార్యక్రమాన్ని తహసీల్దార్ జగన్మోహన్ రెడ్డి తో కలిసి సందర్శించారు. అనంతరం ఆర్డీఓ వెంకన్న మాట్లాడుతు గ్రీన్ ఫీల్డ్ హైవే పై జరుగుతున్న సర్వే వివరాల గురించి అధికారులను అడిగి తెలుసుకున్నారు.గ్రామస్తులంత ఈ సర్వేలో పాల్గొని ఎలాంటి వివాదాలు లేవనెత్తకుండా ఈ సర్వే పూర్తి చేయాలనీ అధికారులకు ఆదేశించారు.ఈ సందర్శనలో గ్రీన్ ఫీల్డ్ హైవే అధికారులు, మండల సర్వేయర్ రఘు ప్రసాద్, గ్రామ సర్పంచ్ మహేందర్ గ్రామ పాలన అధికారి రాజు తదితరులు పాల్గొన్నారు.
అసలైన ఓటర్లను గుర్తించడమే సర్ ప్రక్రియ లక్ష్యం అని పరకాల ఆర్డీఓ డిఎస్ వెంకన్న అన్నారు. శుక్రవారం ఆత్మకూరు మండలం అక్కంపేటలో జరుగుతున్న సర్ ప్రక్రియను తహసీల్దార్ జగన్మోహన్ రెడ్డి తో కలిసి ఆకస్మిక తనిఖీ చేసారు.సర్ ప్రక్రియలో నోటీసులు వచ్చిన ప్రతి ఒక్క ఓటర్ స్పందించి సర్ కు సరిపడా ధ్రువపత్రాలను అందచేయాలని ఓటర్లకు సూచించారు.ఈ తనిఖీలో మండల అదనపు గిర్దావార్ హారిక, గ్రామ సర్పంచ్ ముద్దం సాంబయ్య జిపిఓ సారయ్య, జూనియర్ అసిస్టెంట్లు సతీష్, రాజు పంచాయతీ కార్యదర్శి నిర్మల్,కుమార్,బిఎల్ఓలు,వార్డ్ మెంబర్లు తదితరులు పాల్గొన్నారు.

# కోటిన్నర కరెన్సీ నోట్లతో గణనాథుడి అలంకరణ

**పాల్వంచలో టీమ్ ఏకదంతా యూత్ ఆధ్వర్యంలో విశేష పూజలు**



**కాకతీయ, పాల్వంచ:** భద్రాద్రి కొత్తగూడెం జిల్లా పాల్వంచలో టీమ్ ఏకదంతా యూత్ కమిటీ ఆధ్వర్యంలో శుక్రవారం గణనాథుడికి విశేష పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా విఘ్నేశ్వరుడిని రూ.1.50 కోట్ల కరెన్సీ నోట్లతో సర్వాంగ సుందరంగా అలంకరించారు. కోటిన్నర నోట్లతో దర్శనమిస్తున్న స్వామివారిని తిలకించేందుకు భక్తులు భారీగా తరలివచ్చారు. ప్రత్యేక అలంకరణ భక్తులను విశేషంగా ఆకట్టుకుంది.

# పాక్ వంకర మాటలు..

- అంతర్జాతీయ నిబంధనలు ఉల్లంఘించిన పాక్ నౌక
- భారత యుద్ధ నౌకను ఢీకొన్న ఘటనపై వివరణ
- ఒప్పంద నిబంధనలు పాటించాలని సూచన
- ఎర్ర సముద్ర భద్రతపై భారత్ ఆందోళన
- బంగ్లాదేశ్ ఒప్పందాలపై అధికారిక సమాచారం లేదు
- మాల్దీవులకు ఆర్థిక సహకారం కొనసాగింపు
- విదేశాంగ శాఖ ప్రతినిధి రణ్‌ధీర్ జైస్వాల్




**న్యూఢిల్లీ :** అరేబియా సముద్రంలో భారత యుద్ధ నౌకను పాకిస్థాన్ నౌక ఢీకొన్న ఘటనకు సంబంధించి ఇస్లామాబాద్ చేసిన ఆరోపణలను భారత్ తిరస్కరించింది. పాకిస్థాన్ ఇచ్చిన సమాధానం ఏమాత్రం సమంజసంగా లేదని విదేశాంగ శాఖ ప్రతినిధి రణ్‌ధీర్ జైస్వాల్ స్పష్టం చేశారు. పాకిస్థాన్ ఎప్పుడూ వంకర మాటలే మాట్లాడుతుందని వ్యాఖ్యానించారు. ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా ఇరుపక్షాల మధ్య ఉన్న సంబంధిత ఒప్పందాల్లోని నిబంధనలను తప్పనిసరిగా పాటించాలని సూచించారు. ఉత్తర అరేబియా సముద్రంలో గస్తీ నిర్వహిస్తున్న భారత యుద్ధ నౌక ఐఎన్ఎస్ కోల్‌కతా వద్దకు పాకిస్థాన్ నౌక పీఎన్ఎస్ హునైన్ ప్రమాదకర రీతిలో దూసుకురావడం వల్లే ఢీకొన్న ఘటన జరిగిందని విదేశాంగ శాఖ తెలిపింది. పాకిస్థాన్ నౌక చేసిన ప్రమాదకర ఓవర్‌టేకింగ్ విన్యాసం, 1991 ఏప్రిల్ నాటి సైనిక విన్యాసాలకు సంబంధించి భారత్, పాకిస్థాన్ మధ్య కుదిరిన ఒప్పందంలోని ఆర్టికల్ 10ను ఉల్లంఘించిందని జైస్వాల్ వివరించారు. ఈ ఆర్టికల్ ప్రకారం సముద్రంలో ఇరుదేశాల నౌకాదళ విభాగాలు ఒకదానికొకటి 3 నాటికల్ మైళ్ల పరిధిలో ఉండకూడదని తెలిపారు. సముద్రంలో నౌకలు ఢీకొనకుండా నిరోధించే అంతర్జాతీయ నిబంధనలను కూడా పాకిస్థాన్ ఉల్లంఘించిందని పేర్కొన్నారు.

**భారత నౌకకు పెద్దగా నష్టం లేదు**

మంగళవారం రాత్రి ఉత్తర అరేబియా సముద్రంలో భారత నౌక గస్తీ నిర్వహిస్తున్న సమయంలో ఈ ఘటన చోటుచేసుకుంది. ప్రమాద సమయంలో సముద్రం అల్లకల్లోలంగా ఉన్నట్లు సంబంధిత వర్గాలు తెలిపాయి. పాకిస్థాన్ నౌక హునైన్ తరగతికి చెందినదని, భారత్‌ది యుద్ధ నౌక అని వివరించాయి. ఘటన అనంతరం రెండు నౌకలు దూరంగా వెళ్లిపోయాయని పేర్కొన్నాయి. భారత నౌకకు ఎలాంటి పెద్ద నష్టం వాటిల్లలేదని, ప్రస్తుతం అది సముద్రంలోనే తన విధులను కొనసాగిస్తోందని జైస్వాల్ వెల్లడించారు. ఈ ఘటనపై పాకిస్థాన్ చార్జ్ డి అఫైర్స్‌కు భారత్ ఇప్పటికే తీవ్ర నిరసన తెలిపిందని చెప్పారు. ఎర్ర సముద్ర ప్రాంతంలో భద్రతా పరిస్థితి తీవ్రతరం కావడంపై భారత్ ఆందోళన వ్యక్తం చేసింది. పౌరులు, ఆర్థిక ఆస్తులతోపాటు సౌదీ అరేబియా భూభాగాన్ని లక్ష్యంగా చేసుకుని హౌతీలు జరిపిన దాడులను తీవ్రంగా ఖండించింది. ఇలాంటి దాడులు ప్రాంతీయ భద్రతకు విఘాతం కలిగిస్తాయని జైస్వాల్ అన్నారు. హౌతీల దాడులు ప్రాంతీయ శాంతి, స్థిరత్వంపై ప్రతికూల ప్రభావం చూపే అవకాశం ఉందని తెలిపారు. ముఖ్యంగా బాబ్ అల్ మండబ్ జలసంధి గుండా నౌకాయాన స్వేచ్ఛకు ఈ పరిస్థితులు ముప్పుగా మారతాయని పేర్కొన్నారు. ఈ ప్రాంతంలో త్వరగా శాంతి, స్థిరత్వం పునరుద్ధరించబడుతుందని భారత్ ఆశిస్తున్నట్లు చెప్పారు.

**బంగ్లాదేశ్ ఒప్పందాలపై స్పష్టత లేదు**

గత అవామీ లీగ్ ప్రభుత్వం హయాంలో కుదిరిన 101 ద్వైపాక్షిక ఒప్పందాలను ఢాకాలోని బంగ్లాదేశ్ నేషనలిస్ట్ పార్టీ నేతృత్వంలోని ప్రభుత్వం సమీక్షిస్తోందన్న వార్తలపైనా విదేశాంగ శాఖ స్పందించింది. ఈ అంశానికి సంబంధించి కొన్ని మీడియా కథనాలను పరిశీలించినట్లు జైస్వాల్ తెలిపారు. అయితే బంగ్లాదేశ్ ప్రభుత్వం నుంచి భారత్‌కు అధికారికంగా ఎలాంటి సమాచారం అందలేదని స్పష్టం చేశారు. భారత్ తన జాతీయ ప్రయోజనాలను కాపాడుకునేందుకు అవసరమైన అన్ని చర్యలు తీసుకుంటుందని చెప్పారు. బంగ్లాదేశ్ ప్రభుత్వం ద్వైపాక్షిక ఒప్పందాలపై తీసుకునే నిర్ణయాలను భారత్ పరిశీలిస్తుందని, అధికారిక సమాచారం అందిన తర్వాతే దీనిపై మరింత స్పష్టత వస్తుందని పేర్కొన్నారు.

**మాల్దీవులకు ఆర్థిక సహకారం**

మాల్దీవులకు భారత్ అందిస్తున్న అభివృద్ధి, ఆర్థిక సహాయంపై కూడా విదేశాంగ శాఖ వివరాలు వెల్లడించింది. మాల్దీవులు తన 150 మిలియన్ డాలర్ల ట్రెజరీ బిల్ ఫెసిలిటీని పూర్తిగా చెల్లించినట్లు తెలిపింది. ఆ దేశంపై ఉన్న ఆర్థిక ఒత్తిడిని తగ్గించేందుకు భారత ప్రభుత్వం చర్యలు తీసుకుందని వెల్లడించింది. ఇందులో భాగంగా 5 ఏళ్ల కాలంలో సుమారు 45 మిలియన్ డాలర్ల వడ్డీ చెల్లింపులను భారత ప్రభుత్వం భరించిందని పేర్కొంది. మాల్దీవులతో అభివృద్ధి, ఆర్థిక సహకారం కొనసాగుతుందని తెలిపింది. ప్రాంతీయ స్థిరత్వం, ఆర్థిక సహకారంలో భాగంగా పొరుగు దేశాలకు అవసరమైన సహకారం అందిస్తున్నట్లు విదేశాంగ శాఖ వివరించింది.

# నందిగ్రామ్ బరిలో మమత వర్గానికి అభ్యర్థి కరువు

- నామినేషన్ ఉపసంహరించుకున్న సంచిత ప్రధాన్ దేవ్
- కాంగ్రెస్ అభ్యర్థికి మద్దతు ప్రకటించిన మమత
- టీఎంసీ పేరు, గుర్తుపై వర్గాల మధ్య వివాదం
- పశ్చిమ బెంగాల్ మాజీ ముఖ్యమంత్రి మమతా బెనర్జీ



**కాకతీయ,నేషనల్ డెస్క్ :** పశ్చిమ బెంగాల్ రాజకీయాల్లో అనూహ్య పరిణామం చోటుచేసుకుంది. నందిగ్రామ్ అసెంబ్లీ ఉపఎన్నిక బరిలో ఉన్న మమతా బెనర్జీ వర్గం అభ్యర్థి సంచిత ప్రధాన్ దేవ్ నామినేషన్‌ను ఉపసంహరించుకున్నారు. నామినేషన్ల ఉపసంహరణ గడువు ముగియడానికి ఒక్క రోజు ముందు ఆమె ఈ నిర్ణయం తీసుకున్నారు. దీంతో నందిగ్రామ్‌లో మమతా వర్గానికి అభ్యర్థి లేకుండా పోయింది. అనంతరం కాంగ్రెస్ అభ్యర్థికి పూర్తి మద్దతు ఇస్తామని మమత ప్రకటించారు. సంచిత ప్రధాన్ దేవ్ తన భర్త సత్యజిత్‌తో కలిసి బంగాల్ సచివాలయం నబన్నకు వెళ్లి సీఎం సువేందు అధికారితో భేటీ అయ్యారు. సమావేశం ముగిసిన వెంటనే ఆమె నామినేషన్ పత్రాలను ఉపసంహరించుకున్నారు. ఈ పరిణామం బంగాల్ రాజకీయాల్లో చర్చనీయాంశంగా మారింది.

**టీఎంసీ పేరు, గుర్తుపై వివాదం**

అక్టోబర్ 6న జరగనున్న ఉపఎన్నికల కోసం మమతా వర్గానికి మమతా ఆల్ ఇండియా తృణమూల్ కాంగ్రెస్ పేరుతో ఫుట్‌బాల్ ప్లేయర్ గుర్తును ఈసీ కేటాయించింది. ప్రత్యర్థి అరూప్ రాయ్ వర్గానికి డెమోక్రటిక్ తృణమూల్ కాంగ్రెస్ పేరుతో ఎన్వలప్ గుర్తును ఇచ్చింది. పార్టీ పేరు, సంప్రదాయ ఎన్నికల గుర్తుపై ఈసీ నిర్ణయాన్ని మమతా వర్గం తీవ్రంగా వ్యతిరేకించింది. దేశవ్యాప్తంగా ప్రతిపక్షాలను బలహీనపరచడమే బీజేపీ లక్ష్యమని మమత విమర్శించారు. 28 ఏళ్లుగా తమ పార్టీ వద్ద ఉన్న గుర్తును ఈసీ ఎలా స్తంభింపజేస్తుందని ప్రశ్నించారు. ఈ పరిణామాన్ని ప్రజాస్వామ్యానికి చీకటి రోజుగా అభివర్ణించారు. రాహుల్ గాంధీ, ఆప్ కన్వీనర్ అరవింద్ కేజ్రీవాల్ తనకు సంఘీభావం ప్రకటించారని తెలిపారు. అందరితో కలిసి బీజేపీపై పోరాడతామని, ఇండి కూటమిని బలోపేతం చేసేందుకు నందిగ్రామ్‌లో కాంగ్రెస్‌కు మద్దతు ఇస్తామని స్పష్టం చేశారు.



# ట్రాన్స్‌కో ఉద్యోగి కుటుంబానికి రూ. 1 కోటి బీమా

- మృతుడి తల్లికి ప్రమాద బీమా చెక్కు అందజేత
- ఎస్‌బీఐ శాలరీ ప్యాకేజీతో కుటుంబానికి ఆర్థిక భరోసా
- రాష్ట్ర ఉపముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క

**కాకతీయ, తెలంగాణ బ్యూరో :** రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన టీజీ ట్రాన్స్‌కో ఉద్యోగి మహమ్మద్ ముజాహిద్ కుటుంబానికి రాష్ట్ర ఉపముఖ్యమంత్రి, ఇంధన శాఖ మంత్రి మల్లు భట్టి విక్రమార్క రూ. 1 కోటి ప్రమాద బీమా చెక్కును అందజేశారు. అసెంబ్లీలోని తన చాంబర్‌లో మృతుడి తల్లి, నామినీకి స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా ఆధ్వర్యంలో పరిహారాన్ని అందించారు. రంగారెడ్డి జిల్లా కొత్తూరులోని 132 కేవీ సబ్‌స్టేషన్‌లో జూనియర్ లైన్‌మన్‌గా పనిచేస్తున్న మహమ్మద్ ముజాహిద్ (26) 2025 నవంబర్ 5న నైట్ షిఫ్ట్ ముగించుకుని బైక్‌పై ఇంటికి వెళ్తుండగా జరిగిన రోడ్డు ప్రమాదంలో మృతి చెందారు. రాష్ట్ర ప్రభుత్వం, టీజీ ట్రాన్స్‌కో ఉద్యోగులకు ఎస్‌బీఐ శాలరీ ప్యాకేజీ కింద కల్పిస్తున్న ప్రమాద బీమా పథకంలో భాగంగా కుటుంబ సభ్యులు 2026 ఫిబ్రవరిలో క్లెయిమ్ దరఖాస్తు చేసుకున్నారు. శాఖాపరమైన ప్రక్రియను వేగవంతం చేసిన అధికారులు ఆగస్టు 20న రూ. 1 కోటి పరిహారం మృతుడి తల్లి ఖాతాలో జమ అయ్యేలా చర్యలు తీసుకున్నారు. కార్యక్రమంలో ట్రాన్స్‌కో సీఎండీ కృష్ణ భాస్కర్ పాల్గొన్నారు.

# డ్రైనేజీ పనుల్లో నిర్లక్ష్యం

- రోడ్లపై మురుగు, మట్టితో ప్రజలకు అవస్థలు
- రూ. 10 లక్షల పనులను ప్రణాళికాబద్ధంగా పూర్తి చేయాలి
- బీఆర్ఎస్ కౌన్సిలర్లు బానోత్ నవీన్ నాయక్, శివరాత్రి స్వామి తదితరులు



**కాకతీయ, నర్సంపేట టౌన్ :** నర్సంపేట మున్సిపాలిటీ బస్టాండ్ ఆవరణలో ప్రధాన రహదారిపై చేపడుతున్న డ్రైనేజీ పనులను పూర్తిస్థాయిలో నిర్వహించకుండా రోడ్లపై మురుగు, మట్టి పేరుకుపోయేలా చేస్తున్నారని బీఆర్ఎస్ కౌన్సిలర్లు ఆగ్రహం వ్యక్తం చేశారు. దీంతో ప్రజలు, వ్యాపారులు, వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. సుమారు రూ. 10 లక్షల టెండర్ పనులను ప్రణాళికాబద్ధంగా పూర్తి చేయాలని డిమాండ్ చేశారు. 4 అడుగుల లోతు ఉన్న డ్రైనేజీ కాలువలను సక్రమంగా శుభ్రం చేయకుండా పైపైగా పనులు చేపడితే సమస్య పరిష్కారం కాదన్నారు. వినాయక నవరాత్రులు కొనసాగుతున్న సమయంలో ప్రధాన రహదారిపై మురుగు, మట్టి పేరుకుపోవడం వల్ల ప్రజలకు అసౌకర్యం కలుగుతోందని పేర్కొన్నారు. పనులను త్వరితగతిన పూర్తి చేసి రహదారిని శుభ్రం చేయాలని మున్సిపల్ అధికారులను పలుమార్లు కోరినా పట్టించుకోవడం లేదని కౌన్సిలర్లు విమర్శించారు. అనంతరం బస్టాండ్ పరిసరాలను సందర్శించి పనులను పరిశీలించారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ కౌన్సిలర్లు బానోత్ నవీన్ నాయక్, శివరాత్రి స్వామి, మండల శ్రీదేవి శ్రీనివాస్, కీర్తి దుష్యంత్‌రెడ్డి, దోమటి రమ్య సంతోష్, బుస శిరీష రాజు, నాయిని వేణు, పైసా ప్రవీణ్, పల్నాటి సందీప్, బాగి రాజు తదితరులు పాల్గొన్నారు.

# మిగిలిన 9.56 లక్షల ఇళ్లు కేటాయించాలి

- పీఎంఏవై–జీ కింద రాష్ట్రానికి 2 లక్షల ఇళ్ల మంజూరు
- ఎల్‌నినో ప్రభావంపై కేంద్ర మంత్రికి సీఎం వివరణ
- ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి



**కాకతీయ, హైదరాబాద్ :** పీఎంఏవై-జీ పథకంలో భాగంగా తెలంగాణకు తొలి విడతగా 2 లక్షల ఇళ్లను కేటాయించినందుకు కేంద్ర మంత్రి శివరాజ్‌సింగ్ చౌహాన్‌కు ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి కృతజ్ఞతలు తెలిపారు. హైదరాబాద్ మాదాపూర్‌లో కేంద్ర మంత్రిని సీఎం కలిశారు. ఈ సమావేశంలో మంత్రులు పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి, తుమ్మల నాగేశ్వర్‌రావు, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సంజయ్ జాజు, ఉన్నతాధికారులు పాల్గొన్నారు. రాష్ట్రంలోని 11,56,915 అర్హులైన గ్రామీణ కుటుంబాలకు ఇళ్లు మంజూరు చేయాలని గత జూలైలో ఢిల్లీలో కేంద్ర మంత్రికి వినతిపత్రం అందించిన విషయాన్ని సీఎం గుర్తుచేశారు. రాష్ట్ర డిమాండ్‌కు అనుగుణంగా మిగిలిన 9.56 లక్షల ఇళ్లను కూడా కేటాయించాలని కోరారు. ఎల్‌నినో ప్రభావంతో రాష్ట్రంలో వర్షాభావ పరిస్థితులు నెలకొనే అవకాశం ఉందని, దీంతో వ్యవసాయంలో విద్యుత్ వినియోగం పెరిగిందని రేవంత్‌రెడ్డి వివరించారు. తాగునీరు, విద్యుత్ కొరత రాకుండా ప్రభుత్వం ముందస్తు ప్రణాళికలు సిద్ధం చేసిందన్నారు. వ్యవసాయ రంగంలో ఎల్‌నినో పరిస్థితులను ఎదుర్కొనేందుకు కేంద్ర సహకారం అందించాలని విజ్ఞప్తి చేశారు. దేశంలో ఎక్కడా లేని విధంగా రేషన్ షాపుల ద్వారా పేదలకు సన్నబియ్యం అందిస్తున్నామని, సన్నవడ్లకు రూ. 500 బోనస్ ఇస్తున్నామని తెలిపారు. ప్రత్యామ్నాయ పంటల వైపు రైతులను ప్రోత్సహిస్తున్నామని, 250 ఎకరాల్లో అంతర్జాతీయ ప్రమాణాలతో ఫ్రూట్స్, వెజిటబుల్ మార్కెట్ ఏర్పాటు చేస్తున్నామని వెల్లడించారు.



# యూపీఐ చార్జీల నుంచి ఎరువుల డీలర్లకు మినహాయింపు ఇవ్వాలి

- వ్యవసాయ ఉత్పత్తుల విక్రయాలపై అదనపు భారం పడుతోంది
- డిజిటల్ లావాదేవీలకు ప్రత్యేక రాయితీ విధానం అమలు చేయాలి
- బ్యాంకులు, చెల్లింపు సంస్థలతో ప్రభుత్వం సమన్వయం చేయాలి
- రాష్ట్ర అధ్యక్షుడు నాగుర్ల వెంకటేశ్వర్లు

**కాకతీయ, వరంగల్:** ఎరువులు, పురుగుమందులు, విత్తనాల విక్రయాలపై ఆధారపడి వ్యాపారం నిర్వహిస్తున్న డీలర్లకు యూపీఐ లావాదేవీల చార్జీల నుంచి మినహాయింపు ఇవ్వాలని తెలంగాణ రాష్ట్ర ఫర్టిలైజర్స్, పెస్టిసైడ్స్ అండ్ సీడ్స్ డీలర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు నాగుర్ల వెంకటేశ్వర్లు ప్రభుత్వాన్ని కోరారు. రైతులకు అవసరమైన వ్యవసాయ ఇన్‌పుట్స్‌ను సకాలంలో అందించడంలో డీలర్లు కీలక పాత్ర పోషిస్తున్నారని తెలిపారు. డిజిటల్ చెల్లింపుల వినియోగం రోజురోజుకూ పెరుగుతోందని నాగుర్ల వెంకటేశ్వర్లు అన్నారు. వ్యవసాయ ఉత్పత్తుల కొనుగోళ్లలోనూ రైతులు యూపీఐ ద్వారా చెల్లింపులు చేస్తున్నారని తెలిపారు. ఎరువులు, పురుగు మందులు, విత్తనాల విక్రయాల్లో డిజిటల్ లావాదేవీలు పెరుగుతున్న నేపథ్యంలో డీలర్లపై అదనపు లావాదేవీ వ్యయం పడుతోందన్నారు. వ్యవసాయ రంగానికి సంబంధించిన వ్యాపార లావాదేవీలను ప్రోత్సహించేలా యూపీఐ చెల్లింపులపై డీలర్లకు ప్రత్యేక మినహాయింపు లేదా రాయితీ విధానం అమలు చేయాలని ఆయన కోరారు. డీలర్ల సమస్యలను ప్రభుత్వం పరిశీలించి బ్యాంకులు, డిజిటల్ చెల్లింపు సంస్థలతో సమన్వయం చేసుకుని తగిన నిర్ణయం తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు. రైతులకు నాణ్యమైన వ్యవసాయ ఉత్పత్తులు అందడంతో పాటు డీలర్లపై అనవసరమైన ఆర్థిక భారం పడకుండా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని నాగుర్ల వెంకటేశ్వర్లు కోరారు.



## జర్నలిస్టులకు రైల్వే రాయితీ పాస్ లను పునరుద్ధరించాలి

కాకతీయ, ఇనుగుర్తి : కేంద్ర ప్రభుత్వం నిలుపుదల చేసిన జర్నలిస్టుల రైల్వే రాయితీ పాసులను పునరుద్ధరించాలని శుక్రవారం జాతీయ ఎస్టి కమిషన్ సభ్యులు హుస్సేన్ నాయక్ కి ఇనుగుర్తి మండల ప్రెస్ క్లబ్ అధ్యక్షుడు మహేందర్ రెడ్డి ఆధ్వర్యంలో వినతి అందజేశారు. దీనికి సానుకూలంగా హుస్సేన్ నాయక్ మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వ దృష్టికి తీసుకువెళ్లి జర్నలిస్టులో రైల్వే పాస్ లను పునరుద్ధరిస్తామని సానుకూలంగా ఆయన స్పందించారు. ఈ కార్యక్రమంలో జర్నలిస్టులు తదితరులు పాల్గొన్నారు.

## బీజేవైఎం మండల అధ్యక్షుడిగా శివసాయి గౌడ్



**కాకతీయ, నెల్లికుదురు:** బీజేవైఎం నెల్లికుదురు మండల నూతన అధ్యక్షుడిగా మండలంలోని నైనాల గ్రామానికి చెందిన పెరుమండ్ల శివసాయి గౌడ్ నియమితులయ్యారు. గురువారం జిల్లా బీజేవైఎం అధ్యక్షుడు దీదీ మహేష్ నియామక పత్రాన్ని అందజేశారు. పార్టీలో యువమోర్చా ఉపాధ్యక్షుడిగా రెండుసార్లు, ప్రధాన కార్యదర్శిగా పనిచేసిన సేవలను గుర్తించి ఈ బాధ్యతలు అప్పగించినట్లు ఆయన తెలిపారు. ఈ సందర్భంగా శివ సాయి గౌడ్ మాట్లాడుతూ పార్టీ అభివృద్ధి కోసం నిరంతరం పాటుపడతానని తనపై నమ్మకంతో బాధ్యతలు అప్పగించిన జిల్లా బీజేవైఎం అధ్యక్షుడు దీదీ మహేష్, బీజేపీ జిల్లా అధ్యక్షుడు వెంకటేశ్వర్లకు శివసాయి గౌడ్ కృతజ్ఞతలు తెలిపారు.

## ఉచిత కంటి వైద్య శిబిరం అభినందనీయం



**కాకతీయ, పెద్దవంగర :** గ్రామీణ ప్రాంత ప్రజలకు నాణ్యమైన వైద్య సేవలు అందించాలనే ఉద్దేశంతో నిర్వహిస్తున్న ఉచిత కంటి వైద్యం శిబిరం అభినందనీయమని సర్పంచ్ దంతలపల్లి పర్శరాములు అన్నారు. శుక్రవారం మండల కేంద్రంలోని వద్దే కొత్తపల్లి గ్రామంలో ప్రగతి సేవ సమితి సారథ్యంలో శంకర కంటి హాస్పిటల్ నానక్ రామ్ గూడ సహకారంతో నిర్వహిస్తున్న ఉచిత కంటి వైద్య శిబిరంలో పాల్గొని మాట్లాడారు.కంటి సంబంధిత సమస్యలతో బాధపడుతున్న ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో ఉపసర్పంచ్ రమేష్, ప్రగతి సేవా సమితి వ్యవస్థాపకులు గద్దల జాన్, కోఆర్డినేటర్ జలగం రామ్మూర్తి, విజయ,సుమలత,త్రివేణి,అరవింద్ తదితరులు పాల్గొన్నారు.

## ఏధిర పీహెచ్‌సీలో ఐటీడీఏ పీవో తనిఖీ

**వైద్య సేవలు, సిబ్బంది హాజరుపై పరిశీలన**



**కాకతీయ, ఏటూరునాగారం :** నూగూరు వెంకటపురం మండలం ఏధిర గ్రామంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని ఐటీడీఏ ప్రాజెక్టు అధికారి లెనిన్ వత్సల్ టొప్పో శుక్రవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. సిబ్బంది హాజరు, మందుల నిల్వలు, వ్యాక్సిన్‌ల భద్రత, రోగులకు అందుతున్న సౌకర్యాలను పరిశీలించి, వైద్య సేవల నిర్వహణపై అధికారులకు సూచనలు చేశారు. సిబ్బంది హాజరు పట్టికను తనిఖీ చేసి మంజూరైన పోస్టులు, ఖాళీల వివరాలను తెలుసుకున్నారు. సిబ్బంది క్రమం తప్పకుండా విధులకు హాజరయ్యేలా పర్యవేక్షించాలని ఆదేశించారు. ఫ్రీజర్‌లోని వ్యాక్సిన్‌లు, ఇంజెక్షన్‌ల నిల్వకు నిరంతర విద్యుత్ సరఫరా ఉండేలా చూడాలని సూచించారు. మందుల నిల్వ, తయారీ, గడువు తేదీలను పరిశీలించి, స్టాక్ స్వీకరణ, పంపిణీ వివరాలకు రిజిస్టర్ నిర్వహించాలని, సీజనల్ మందులు, పాముకాటు, కుక్కకాటు వ్యాక్సిన్‌లు అందుబాటులో ఉంచాలని ఆదేశించారు. ఇన్‌పేషెంట్ వార్డులు, మరుగుదొడ్ల సౌకర్యాలను పరిశీలించి, నమోదవుతున్న వ్యాధుల వివరాలను అడిగి తెలుసుకున్నారు. నివాస ప్రాంతాల్లో వైద్య శిబిరాలు నిర్వహించాలని సూచించారు. రోగులతో మాట్లాడి ఆరోగ్య పరిస్థితులు, పింఛన్లు, నిత్యావసర వస్తువుల సరఫరాపై ఆరా తీశారు. రాత్రివేళ సిబ్బంది, వసతి సౌకర్యాలపై వివరాలు తెలుసుకుని, అవసరాలుంటే ఐటీడీఏ డిప్యూటీ జిల్లా వైద్య, ఆరోగ్య అధికారితో సమన్వయం చేసుకోవాలని ఆదేశించారు. అత్యవసర రోగుల తరలింపునకు అలుబాక కేంద్రంగా 108 అంబులెన్స్ సేవలు అందుబాటులో ఉంటాయని వైద్యాధికారి తెలిపారు.

## గోవిందరాజుల స్వామిని దర్శించుకున్న ప్రభుత్వ విప్

**కాకతీయ,చందుర్తి :** రాజన్న సిరిసిల్ల జిల్లా వేములవాడ నియోజకవర్గం చందుర్తి మండలం సనుగుల గ్రామంలోని శ్రీ శ్రీదేవి భూదేవి సమేత గోవిందరాజుల స్వామివారిని ప్రభుత్వ విప్, వేములవాడ ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్ తన జన్మదిన సందర్భంగా దర్శించుకున్నారు. ఆలయ కమిటీ సభ్యులు ఆయనకు ఘన స్వాగతం పలికారు. అనంతరం స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించిన ఆది శ్రీనివాస్‌కు ఆలయ కమిటీ సభ్యులు ఘనంగా సన్మానం చేశారు.



# బల్దియాలో అంతర్గత బదిలీలు

- ప్రమోషన్లు పొందిన ఉద్యోగులకు కొత్త స్థానాలు
- 6 మంది ఉద్యోగులకు విభాగాల మార్పు
- గ్రేటర్ వరంగల్ మున్సిపల్ కమిషనర్ టి. వెంకన్న

**కాకతీయ, వరంగల్ ప్రతినిధి :** గ్రేటర్ వరంగల్ మున్సిపల్ కార్పొరేషన్‌లో పలువురు ఉద్యోగులను అంతర్గత బదిలీలు చేస్తూ కమిషనర్ టి. వెంకన్న ఉత్తర్వులు జారీ చేశారు. ఇటీవల ప్రమోషన్లు పొందిన ఉద్యోగులకు స్థానాలు కల్పించేందుకు ఈ మార్పులు చేపట్టినట్లు అధికార వర్గాలు తెలిపాయి. బి. తిరుపతి (సీనియర్ అసిస్టెంట్)ను సీఎల్‌సీ సెక్షన్ నుంచి నక్కలగుట్ట సర్కిల్‌కు బదిలీ చేశారు. బి. బాలు (మేనేజర్/రెవెన్యూ ఆఫీసర్, సూపరింటెండెంట్)ను నక్కలగుట్ట సర్కిల్ ఈ1 సెక్షన్ నుంచి హార్టికల్చర్, డీఆర్ఎఫ్ సెక్షన్లకు మార్చారు. ఎస్. రాంబాబు (మేనేజర్/రెవెన్యూ ఆఫీసర్)ను టౌన్ ప్లానింగ్ నుంచి ఎస్టాబ్లిష్‌మెంట్ సెక్షన్‌కు బదిలీ చేశారు. ఎండీ. హబీబ్ పాషాను హార్టికల్చర్ బాధ్యతల నుంచి రిలీవ్ చేస్తూ సీఎల్‌సీ సెక్షన్‌లోనే కొనసాగించారు. పి. రవిని హన్మకొండ సర్కిల్ టిసెక్షన్ నుంచి ప్రధాన కార్యాలయ అకౌంట్స్ సెక్షన్‌కు, ఆయేషాను ఎస్టాబ్లిష్‌మెంట్ సెక్షన్ నుంచి హన్మకొండ సర్కిల్ టిసెక్షన్‌కు బదిలీ చేశారు. బదిలీ అయిన ఉద్యోగులందరూ వారం రోజుల్లోగా ప్రస్తుత బాధ్యతలను అప్పగించి, కొత్త స్థానాల్లో రిపోర్ట్ చేయాలని కమిషనర్ ఆదేశించారు.

## జర్నలిస్ట్ ఐలయ్య కుటుంబానికి పరామర్శ

**కాకతీయ, పెద్దవంగర :** మహబూబాబాద్ జిల్లా పెద్దవంగర మండల కేంద్రంలో ప్రజా ప్రతిజ్ఞ రిపోర్టర్ చింతల ఐలయ్య అనారోగ్యంతో మృతి చెందిన విషయం తెలిసిందే. విషయం తెలుసుకున్న కాంగ్రెస్ నాయకులు శుక్రవారం ఐలయ్య కుటుంబాన్ని పరామర్శించి ఆర్థిక సహాయం అందించారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ మండల పార్టీ అధ్యక్షులు రంగు మురళి గౌడ్ మాట్లాడుతూ జర్నలిస్టుల కుటుంబాలకు ప్రభుత్వం అండగా ఉంటుందన్నారు. ఆయన వెంట నాయకులు సోమన్న,సైదులు, హరికృష్ణ, శ్రీనివాస్, మోహన్ రావు, వెంకన్న నాయక్, సత్యం, సమ్మయ్య తదితరులు ఉన్నారు.

# పాత పెన్షన్ విధానాన్ని పునరుద్ధరించాలి

- ఉద్యోగ, ఉపాధ్యాయుల హామీలు నెరవేర్చాలి
- టీఆర్‌టీఎఫ్ జిల్లా అధ్యక్షుడు బుర్ర కృష్ణ ప్రసాద్‌గౌడ్




**కాకతీయ, వేములవాడ:** రాష్ట్ర ప్రభుత్వం కాలయాపన, వాయిదాల ధోరణిని విడనాడి ఉద్యోగ, ఉపాధ్యాయులకు ఇచ్చిన హామీలను వెంటనే అమలు చేయాలని టీఆర్‌టీఎఫ్ రాజన్న సిరిసిల్ల జిల్లా అధ్యక్షుడు బుర్ర కృష్ణప్రసాద్‌గౌడ్, జిల్లా ప్రధాన కార్యదర్శి బోయన్నగారి నారాయణ డిమాండ్ చేశారు. వేములవాడ మండలంలోని వివిధ పాఠశాలల్లో నిర్వహించిన టీఆర్‌టీఎఫ్ సభ్యత్వ నమోదు కార్యక్రమంలో వారు మాట్లాడారు. పెండింగ్‌లో ఉన్న 6 డీఏలను మంజూరు చేయడంతో పాటు పీఆర్సీని వెంటనే ప్రకటించి దసరాలోపు అమలు చేయాలని కోరారు. ఉద్యోగ, ఉపాధ్యాయులకు శాపంగా మారిన సీపీఎస్‌ను రద్దు చేసి పాత పెన్షన్ విధానాన్ని పునరుద్ధరించాలని డిమాండ్ చేశారు. రిటైర్డ్ ఉద్యోగ, ఉపాధ్యాయుల పెన్షన్ ప్రయోజనాలను విడుదల చేయాలని, ప్రాథమిక పాఠశాలలపై ప్రభావం చూపుతున్న GO25ను సవరించాలని, GO317 బాధిత ఉపాధ్యాయులకు న్యాయం చేయాలని కోరారు. కార్యక్రమంలో కోల వినయ్‌కుమార్, తుమ్మల బాబురాజు, పోతుగంటి రమేష్ తదితరులు పాల్గొన్నారు.

# వాలీబాల్ పోటీల్లో రన్నరప్‌గా శంకరపట్నం జట్టు

**జిల్లా స్థాయి పోటీల్లో ప్రతిభ చాటుకున్న క్రీడాకారిణులు**

**కాకతీయ,శంకరపట్నం:** అంబేద్కర్ స్టేడియంలో నిర్వహించిన స్కూల్ గేమ్స్ అండర్-14 బాలికల కరీంనగర్ జిల్లా స్థాయి వాలీబాల్ పోటీల్లో శంకరపట్నం మండల జట్టు ద్వితీయ స్థానం సాధించింది. పోటీల అనంతరం హెచ్‌డీఎఫ్ సెక్రటరీ బన్సీలాల్ చేతుల మీదుగా క్రీడాకారిణులు బహుమతి అందుకున్నారు. ఈ సందర్భంగా శంకరపట్నం ఎంఈఓ ఎం. లక్ష్మీనారాయణ, ఏజ్‌యాప్ మండల సెక్రటరీ ఆడెపు శ్రీనివాస్, జడ్పీహెచ్ఎస్ కేశవపట్నం హెచ్ఎం సుభాష్, కేశవపట్నం సర్పంచ్ గోదారి రాజేంద్రప్రసాద్ క్రీడాకారిణులను అభినందించారు. అలాగే వ్యాయామ ఉపాధ్యాయుడు భక్తు రాజకుమార్‌ను ప్రత్యేకంగా అభినందించారు.




# లోపాలు పునరావృతమైతే కఠిన చర్యలు

- ఆసుపత్రుల్లో వ్యాక్సిన్లు, మౌలిక వసతులు అందుబాటులో ఉండాలి
- పాక్షికంగా నిలిచిన భవనాలను త్వరగా పూర్తి చేయాలి
- ఐటీడీఏ ప్రాజెక్టు అధికారి లెనిన్ వత్సల్ ఆదేశం

**కాకతీయ, ఏటూరునాగారం:** ఐటీడీఏ పరిధిలోని ఆరోగ్య, ఇంజనీరింగ్ శాఖల పనితీరు, మౌలిక వసతులు, ప్రజలకు అందుతున్న సేవలపై ప్రాజెక్టు అధికారి లెనిన్ వత్సల్ శుక్రవారం సమీక్ష నిర్వహించారు. ఆసుపత్రుల్లో సిబ్బంది హాజరు, మాతా శిశు ఆరోగ్య సేవలు, వ్యాక్సిన్ల నిల్వ, ఆసుపత్రుల నిర్వహణ, ఆరోగ్య శిబిరాలపై చర్చించారు. హాజరు వివరాలను సక్రమంగా నమోదు చేయాలని, ఇప్పటికే గుర్తించిన లోపాలు పునరావృతమైతే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. వ్యాక్సిన్ల గడువు తేదీలు, నిల్వ పరిస్థితులను పరిశీలిస్తూ శీతలీకరణ పరికరాలను సక్రమంగా నిర్వహించాలని ఆదేశించారు. ప్రసూతి సేవలకు అవసరమైన పడకలు, మరుగుదొడ్లు, నీటి వసతి కల్పించాలని సూచించారు. ఇంజనీరింగ్ శాఖలో 13 సంస్థల పరిధిలో మంజూరైన 46 భవనాల్లో 42 పూర్తయ్యాయని అధికారులు తెలిపారు. మరో భవనం వినియోగానికి సిద్ధంగా ఉందని, ఇంకొకటి త్వరలో అప్పగిస్తామని వివరించారు. ప్రసూతి నిరీక్షణ భవనాలకు సంబంధించిన 5 పనులు పూర్తయ్యాయని తెలిపారు. పాక్షికంగా నిలిచిన భవనాలను నాణ్యతతో నిర్దేశిత గడువులోగా పూర్తి చేసి ప్రజల వినియోగంలోకి తీసుకురావాలని లెనిన్ వత్సల్ ఆదేశించారు. సమావేశంలో టీవీఆర్ దామోదరస్వామి, డాక్టర్ క్రాంతికుమార్, ప్రవీణ్ తదితరులు పాల్గొన్నారు.

# విద్యార్థులకు గోల్ కార్డులు అందజేత

**కాకతీయ,శంకరపట్నం:** మొలంగూర్ పాఠశాల విద్యార్థులకు కరీంనగర్ సీపీ గౌస్ అలాం అందించిన గోల్ కార్డులను శుక్రవారం అందజేశారు. విద్యార్థులు తమ లక్ష్యాలను గుర్తించి, వాటిని సాధించే దిశగా ప్రేరణ, ప్రోత్సాహం కల్పించాలనే ఉద్దేశంతో 14 మంది విద్యార్థులకు వారి తల్లిదండ్రుల సమక్షంలో గోల్ కార్డులను అందజేశారు. ఈ సందర్భంగా సీపీ గౌస్ అలాం, హుజూరాబాద్ ఏసీపీ మాధవి, కేశవపట్నం ఎస్ఐ శేఖర్ రెడ్డి కి పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు కంకణాల నీరజ ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. స్పోర్ట్స్ మెటీరియల్ అందజేత. అదేవిధంగా స్థానిక ఎస్ఐ శేఖర్‌రెడ్డి మొలంగూర్ పాఠశాల విద్యార్థులకు స్పోర్ట్స్ మెటీరియల్‌ను అందజేశారు. విద్యార్థుల్లో క్రీడా ప్రతిభను ప్రోత్సహించేందుకు క్రీడా సామగ్రిని అందించిన ఎస్ఐ శేఖర్ రెడ్డికి ప్రధానోపాధ్యాయురాలు కంకణాల నీరజ ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.




# భక్తిశ్రద్ధలతో కుంకుమ పూజ

**పోచమ్మ దేవాలయ వీధి పరపతి సంఘం ఆధ్వర్యంలో పూజలు**

**కాకతీయ, హన్మకొండ :** హన్మకొండ పోచమ్మకుంటలోని పోచమ్మ దేవాలయ వీధి పరపతి సంఘం ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న గణపతి నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా కుంకుమ పూజా కార్యక్రమాన్ని భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. మహిళా సభ్యులు బైరి మంగ, అల్లి సౌజన్య, కల్లపెల్లి రజిత, నేత నీరజ, సులోచన, మమత తదితరులు పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. మహిళల భాగస్వామ్యంతో జరిగిన ఈ కార్యక్రమం భక్తి, ఆధ్యాత్మికతలతో వైభవంగా సాగింది. భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని గణపతిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు.

Printed and published owned by kiran goud arelli be half of amulya publications & printers graphics. printed at hanamkonda and published at H No. 5-12-42, pvr residency, hanuman nagar, hanamkonda- 506009- EDITOR- ARELLI KIRAN GOUD - RNI NO. TG TEL/25/A1234 - contact - 7396604266